క్లుప్తంగా

సూరమ్మ ప్రాజెక్టుకు నిధులివ్వండి



సీఎంకు విన్నవిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్: సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంగళవారం కలిశారు. కథలాపూర్ మండలం కలిగోట సూరమ్మ ప్రాజెక్టు కుడి ఎడమ కాలువ పనులకు నిధులు కేటాయించాలని సీఎంకు విన్నవించినట్లు పేర్కొన్నారు. కాలువ పనులకు ఇప్పటికే రూ. 10 కోట్లు నిధులు విడుదల చేశారని, ఇంకా కొన్ని నిధులు మంజూరు చేస్తే పనులు పూర్తవుతాయని సీఎంతో చర్చించినట్లు విప్ తెలిపారు. దీనికి సీఎం సానుకూలంగా స్పందించారన్నారు.

ఘనంగా సంకటహర చతుర్థి వేడుకలు



మహాగణపతికి ప్రత్యేక పూజలు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీ నృసింహస్వామి అనుబంధ శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలోని మహాగణపతి ఆలయంలో మంగళవారం సంకటహర చతుర్థి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్ మంత్రోచ్ఛారణలతో స్వామివారికి ప్రత్యే పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు తదితరులున్నారు.

సహస్ర లింగాల ఆలయంలో..

జగిత్యాలరూరల్: మండలంలోని పొలాస సహస్ర లింగాల దేవాలయంలో అంగారక సంకష్టహర చతుర్థి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహా గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు నలమాసు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

మెట్‌పల్లి రూరల్: మెట్‌పల్లి మండలం వెల్లుల ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం జాతర సందర్భంగా రూ.24,475 ఆదాయం సమకూరినట్లు కార్యనిర్వహణ అధికారి కాంతరెడ్డి తెలిపారు. వివిధ సేవా టికెట్లు, హుండీ ద్వారా వచ్చిన ఆదాయం లెక్కించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది అనిల్‌రావు, కేశవ్, సత్యగంగు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధులు బహిష్కరణ

ధర్మపురి: ఆసిఫాబాద్ కోర్టులో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా విధులు నిర్వహిస్తున్న నరహరిపైన జరిగిన దాడిని ఖండిస్తూ ధర్మపురి కోర్టులో మంగళవారం న్యాయవాదులు తమ విధులు బహిష్కరించారు. ఆసిఫాబాద్ జిల్లా బార్ అసోసియేషన్ పిలుపు మేరకు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అలుక వినోద్ మాట్లాడుతూ న్యాయవాదులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రభుత్వం న్యాయవాదులకు రక్షణ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేసి దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మామిడాల శ్రీకాంత్ కుమార్, రౌతు రాజేష్, ఇమ్మడి శ్రీనివాస్, బందెల రమేశ్ పాల్గొన్నారు.

రాహుల్ గాంధీని అరెస్టు చేయటం సరికాదు

కోరుట్ల: పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా అరెస్టు చేయటం సరికాదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. పట్టణంలోని జువ్వాడి భవన్‌లో మంగళవారం మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఈసీ పూర్తిగా విఫలమైందని,గాంధేయ పద్ధతిలో నిరసన తెలిపిన రాహుల్ గాంధీ, ఇతర కాంగ్రెస్, ఇండియా కూటమి సభ్యులను అరెస్టు చేయటం దుర్మార్గమని విమర్శించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, సదానందచారి, మహిపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

గొల్లపల్లి: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బుధవారం గొల్లపల్లి మండలంలో పర్యటించనున్నట్లు పార్టీ శ్రేణులు తెలిపాయి.

బీమాతో రైతన్నకు దీమా

- నేటితో ముగియనున్న గడువు
- మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం
- జిల్లా వ్యాప్తంగా 248550 మంది రైతులు
- కొత్తగా 8179 మందికి పట్టాదారు పాస్‌బుక్‌లు
- దరఖాస్తు చేసుకోని వారికి అవకాశం



రైతు బీమాకు దరఖాస్తు చేసుకుంటున్న రైతులు

గొల్లపల్లి/మల్లాపూర్: రైతు బీమా పథకానికి దరఖాస్తుల గడువు నేటితో ముగియనుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2018 ఆగస్టు 14న ఈ పథకాన్ని ప్రారంభించగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ పథకాన్ని కొనసాగిస్తోంది. రైతుల పేరుపై ప్రభుత్వమే సంబంధిత కంపెనీకి బీమా ప్రీమియం డబ్బులు వందశాతం చెల్లిస్తోంది. ప్రతి ఏడాది పథకం కాలపరిమితి ఆగస్టు 14తో ముగుస్తుంది. వచ్చే ఏడాది 2025–26 కాలానికి గాను రైతు బీమా పథకాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. దీనిలో భాగంగా ఇప్పటి వరకు ఉన్న రైతుల జాబితాతో పాటు, 2025 జూన్ 5వ తేదీ వరకు భూభారతి పోర్టల్ ద్వారా కొత్తగా పాస్‌బుక్‌లు పొందిన రైతులు కూడా ఈ పథకానికి దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. బుధవారం లోగా తమ పూర్తి వివరాలతో సంబంధిత ఏఈవోల వద్ద దరఖాస్తు చేసుకోవాలి.

జిల్లాలో 248550మంది రైతులు

జిల్లాలో 248550 మంది రైతులు ఉండగా 136687 బీమా పథకంలో కొనసాగుతున్నారు. ఈ ఏడాది జూన్ 5 వరకు కొత్తగా పాస్‌బుక్‌లు పొందిన రైతులతో పాటు, గతంలో పాస్‌బుక్‌లు పొంది బీమా పథకానికి దరఖాస్తులు చేసుకోని రైతులు నేటి బుధవారం లోగా దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ప్రభుత్వం ప్రతి యేటా ఒక్కో రైతుకు రూ.2700 చొప్పున ప్రీమియం చెల్లిస్తోంది. 18–59 ఏళ్ల మధ్య గల రైతులు ఈ పథకానికి అర్హులు. రైతులు తమ ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌బుక్, నామిని ఆధార్‌కార్డుతో సంబంధిత ఏఈవోలను సంప్రదించాలి. గతంలో బీమాకు నమోదు చేసుకున్న రైతులు మళ్లీ దరఖాస్తులు చేసుకోవాల్సిన అవసరం లేదు.

కొత్తగా 8179 మంది రైతులు :

ఈనెల 11 నుంచి 13 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 2025 జూన్ 5 వరకు పట్టాదారు పాస్‌బుక్‌లు పొందిన రైతులు 8179వేల మంది ఉన్నారు. పట్టాదారు పాస్‌బుక్‌లు పొందిన రైతులంతా బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారులు రైతులకు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. గతంలో రైతుబీమా చేసుకున్న రైతులు ఏవైనా మార్పుల కోసం ఆధార్, నామినిలో మార్పులు చేసుకోవాలంటే ఈనెల 13లోపు సంబంధిత ఏఈవోలకు ధ్రువీకరణ పత్రాలు సమర్పించి మార్పులు చేసుకోవాలి.

రైతులు దరఖాస్తు చేసుకోవాలి



పట్టా పాసుపుస్తకం ఉంచి 18 నుంచి 59 ఏళ్ల వయస్సు ఉన్నవారు రైతుబీమా చేయించుకోవాలి. పాసుపుస్తకం, ఆధార్‌కార్డుల జిరాక్స్‌లతో స్వయంగా రైతులే ఏఈవోల వద్దకి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి. ఇతరులు వెళ్తే వివరాలు నమోదు చేయరు. సందేహాలు ఉంటే వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలి.

– లావణ్య, ఏవో, మల్లాపూర్

అర్హులైన రైతులందరికీ వర్తింపు



అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వం బీమా వర్తింపజేస్తోంది. జిల్లా వ్యాప్తంగా 1.36,687 లక్షల మంది రైతులు ఈ పథకంలో కొనసాగుతున్నారు. కొత్తగా పాస్‌బుక్‌లు పొందిన 8179 వేల మంది రైతులతో పాటు, గతంలో పాస్‌బుక్‌లు ఉన్న రైతులు కూడా బీమా పథకానికి దరఖాస్తులు చేసుకోవాలి. గతేడాది 609 మంది రైతులకు 30.45 కోట్ల బీమా చెల్లించాం.

– భాస్కర్, జిల్లా వ్యవసాయాధికారి

వ్యవసాయ కళాశాలలో ర్యాగింగ్ నిరోధక దినోత్సవం



మాట్లాడుతున్న రూరల్ సీఐ సుధాకర్

జగిత్యాలఅగ్రికల్చర్: మండలంలోని పొలాస వ్యవసాయ కళాశాలలో మంగళవారం ర్యాగింగ్ నిరోధక దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రూరల్ సీఐ సుధాకర్ మాట్లాడుతూ స్నేహాన్ని మించింది ఈ సమాజంలో మరొక్కటి లేదని చెప్పారు. చెడు స్నేహాలు, మంచి స్నేహాలు తెలుసుకుంటూ, మంచి స్నేహితులతో ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు కన్న కలలను సాకారం చేసేందుకు అహర్నిశలు ప్రయత్నించాలని సూచించారు. ర్యాగింగ్ పేరిట ఇతర విద్యార్థులను వేధిస్తే చట్టం ప్రకారం చర్యలు కఠినంగా ఉంటాయని తెలిపారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.సుజాత మాట్లాడుతూ ర్యాగింగ్ నిరోధకానికి కళాశాలలో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై సదాకర్, స్టూడెంట్ అఫైర్ కమిటీ ఇన్‌చార్జి డాక్టర్ కిరణ్ రెడ్డి, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు గంజాయికి వ్యతిరేకంగా ఉద్యమించాలి



గంజాయి వ్యతిరేక నినాదాలు చేస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: యువత జీవితాలను నాశనం చేస్తున్న గంజాయిని తరిమికొట్టేందుకు విద్యార్థులు ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ నాయకుడు ఇరుగురాల్ల భూమేశ్వర్ పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఎస్‌కేఎన్ఆర్ కళాశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ జెండా ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం భూమేశ్వర్ మాట్లాడుతూ 90 ఏళ్లుగా విద్యారంగ సమస్యలపై పోరాటం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ జెండాను విద్యార్థులు అక్కున చేర్చుకుని విద్యార్థుల సమస్యల పరిష్కారంతో పాటు సామాజిక రుగ్మతలు, దురలవాట్లపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వెన్న మహేశ్, అక్రమాలిక్, మంద రాకేశ్, భరత్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

జగిత్యాలటౌన్: కంట్రిబ్యూటరీ పెన్షన్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని పీఆర్‌టీయూటీఎస్, టీజీఏసీ నాయకులు డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1వ తేదీన పీఆర్‌టీయూటీఎస్, టీజీఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరాపార్క్‌లో నిర్వహించనున్న మహాధర్నా పోస్టర్‌ను బుధవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ విధానం రద్దు చేసి ఓపీఎస్ విధానం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో టీజీఏసీ నాయకులు నాగేందర్‌రెడ్డి, రవిబాబు, ట్రిసా జిల్లా అధ్యక్షులు వకీల్, ఉపాధ్యాయ సంఘం నాయకులు ఆనందరావు, అమర్నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం వైఫల్యం

పెగడపల్లి: వానాకాలం సాగు చేసిన పంటలకు సరిపడు యూరియా సరఫరా చేయుటలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు లోక మల్లారెడ్డి అన్నారు. మండలంలోని నర్సింహునిపేటలో మంగళవారం బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం జరిగింది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల గెలుపే లక్ష్యంగా చేపట్టాల్సిన కార్యాచరణపై కార్యకర్తలు, నాయకులతో దిశనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పాలనలో జరిగిన అభివృద్ధి, ప్రజలకు అందించిన సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరిస్తూ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు ఐక్యమత్యంతో పని చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలని దివ్యాంగుల వినతి

జగిత్యాలటౌన్: సమస్య పరిష్కారానికి ప్రజావాణికి వచ్చిన దివ్యాంగుడు రాజగంగారాంపై దురుసుగా ప్రవర్తించిన పోలీసులు, కలెక్టరేట్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని దివ్యాంగులు మంగళవారం జగిత్యాల కలెక్టరేట్‌లో నిరసన తెలిపారు. అనంతరం ఏవోకు వినతిపత్రం అందజేశారు. దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు లంకదాసరి శ్రీనివాస్ మాట్లాడుతూ దివ్యాంగుడిని డోర్ దగ్గర పడవేయడం చట్టరీత్యా నేరమని అన్నారు. ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ఉండేలా కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అజ్గర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని యువకుని మృతదేహం



మెట్‌పల్లి: పట్టణ శివారులోని టీటీడీ కల్యాణ మండపం వెనుక ఉన్న నిర్మానుష్య ప్రదేశంలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంంంం లభ్యమైందని పోలీసులు తెలిపారు. సదరు యువకుడు అపస్మారక స్థితిలో కింద పడి ఉండడాన్ని గమనించిన కొందరు పోలీసులకు సమాచారమందించారు. వెంటనే అక్కడకు వెళ్లి ప్రభుత్వాసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు చెప్పారు. అనంతరం మృతదేహాన్ని అందులోని మార్చురీకి తరలించారు.

బాధ్యతలు స్వీకరణ

గొల్లపల్లి: మండల తహసీల్దార్‌గా మంగళవారం మహ్మద్ అబ్దుల్ మాజీద్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన వరందన్ జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌కు బదిలీ కాగా, బుగ్గారం తహసీల్దార్‌గా పనిచేసిన మహ్మద్ అబ్దుల్ మాజీద్ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది నూతన తహసీల్దార్‌కు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపీడీవోకు సన్మానం

వెల్గటూర్: ఎంపీడీవోగా ఇటీవలే బదిలీపై వచ్చిన కృపాకర్‌ను బీఆర్ఎస్ నాయకులు కలిసి సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాంచందర్, ప్రధాన కార్యదర్శి కుమార్, నాయకులు వెంకటేశ్, తిరుపతి, రవి, భరత్, పాల్గొన్నారు.

ఎండపల్లిలో ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్‌కు ఆదేశం

వెల్గటూర్: ఎండపల్లి మండల కేంద్రంలో ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపాలని, సోమవారం మండల కేంద్రంలో గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. అలాగే నాలుగు జిల్లాలను కలిపే రాజారాంపల్లి చౌరస్తాలో కూడా బస్‌స్టాప్ మంజూరు చేయాలని, ఈ చౌరస్తాలో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటుందని రాజారాంపల్లికి చెందిన ఏలేటి శైలేందర్‌రెడ్డి ఆర్టీసీ డీఎంను కోరారు. దీనిపై వెంటనే స్పందించిన మంత్రి లక్ష్మణ్ కుమార్ కరీంనగర్ ఆర్టీసీ డీఎంకు సమస్యను వివరించి ఎండపల్లి, రాజారాంపల్లికి ఎక్స్‌ప్రెస్ బస్‌స్టాప్ మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. బుధవారం నుంచి ఎండపల్లి, రాజారాంపల్లిలో ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపాలని ఆర్టీసీ 2 డిపో మేనేజర్ శ్రీనివాస్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మండల వాసులు హర్షం వ్యక్తం చేసి, మంత్రి లక్ష్మణ్ కుమార్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

రైతు బీమాకు దరఖాస్తుల స్వీకరణ

జగిత్యాలరూరల్: రైతులకు బీమా పథకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జగిత్యాల ఏవో వినీల తెలిపారు. జగిత్యాల అర్బన్ మండలంలో కొత్తగా 244 మంది రైతులకు పట్టాదారు పాస్‌బుక్‌లు జారీ అయ్యాయని, వీరిలో అర్హులైన రైతులందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

జగిత్యాలరూరల్: మండలంలోని ఎన్ఆర్ఈజీఎస్ 4వ సామాజిక తనిఖీ ప్రజావేదిక బుధవారం ఉదయం 9.30 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమాదేవి తెలిపారు. సమావేశానికి మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో ఏడాదిపాటు జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందం తనిఖీ నిర్వహించేందుకు ప్రజావేదిక ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉపాధి కూలీలు ప్రజావేదికకు హాజరు కావాలని కోరారు.

ఉద్యోగుల బదిలీ సాధారణం

జగిత్యాలరూరల్: ఉద్యోగుల బదిలీ సాధారణమని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. జగిత్యాల రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ ధర్మపురికి బదిలీ కాగా తహసీల్ కార్యాలయ సిబ్బంది మంగళవారం సాయంత్రం ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ అరుణ్‌కుమార్, ఆర్ఐ భూమయ్య, సీనియర్ అసిస్టెంట్ గంగారాం, సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా అరుణ్‌కుమార్

జగిత్యాల రూరల్ తహసీల్దార్ శ్రీనివాస్ సోమవారం ధర్మపురికి బదిలీ కాగా, జగిత్యాల రూరల్ డెప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న అరుణ్‌కుమార్ మంగళవారం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు.

ఆలయ వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్డీవో

జగిత్యాలటౌన్: ఈనెల 20వ తేదీ నుంచి 23 వరకు నిర్వహించే శ్రీ లోకమాత పోచమ్మతల్లి ఆలయ 63వ వార్షికోత్సవాల కరపత్రాన్ని మంగళవారం జగిత్యాల ఆర్డీవో పులి మధుసూదన్‌గౌడ్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోచమ్మతల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో పట్టణ ప్రజలు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాల్సిందిగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు గాజుల రాజేందర్, మాజీ కౌన్సిలర్ రేపల్లె హరిక్రిష్ణ, నాగమల్ల మనోహర్, గాజోజి రాజగోపాలచారి,తదితరులు పాల్గొన్నారు.

సర్వే పూర్తి.. త్వరలో నోటీసులు



కోమన్‌పల్లిలో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

సారంగాపూర్: కోమన్‌పల్లిలో భూముల సర్వే పూర్తి అయ్యిందని, దీనిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే జారీ చేసిన నోటీసులకు అవసరమైన పత్రాలను రైతులు ధృవీకరణ పత్రాలను అందజేయాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. మంగళవారం బీర్‌పూర్ మండలం కోమన్‌పల్లిలో జరిగిన రెవెన్యూ గ్రామసభలో పాల్గొన్నారు. భూభారతి కింద కోమన్‌పల్లి గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకుని రీసర్వే పూర్తి చేశామని, ఇక్కడ 602 ఎకరాల భూమి ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. రైతుల భూములు పట్టాదారు పాసుపుస్తకాల్లో ఉన్నదాని కంటే మోఖా మీద ఎక్కువ, తక్కువ ఉంటే వీటిపై త్వరలో నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. ఎక్కువ, తక్కువ ఉన్న భూముల వివరాలను సరిచేయడానికి ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా వాటికి తగిన ధృవీకరణ పత్రాలను నోటీసులు అందిన తరువాత సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో మధుసూధన్, సర్వే ఏడీ వెంకటరెడ్డి, తహసీల్దార్ సుజాత, డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ శ్రీనివాస్, గ్రామస్తులు ఉన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీలు



మల్యాల: తిరంగా ర్యాలీలో పాల్గొన్న స్థానికులు, బీజేపీ నాయకులు

మల్యాల: మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా తిరంగా ర్యాలీని నిర్వహించారు. జాతి సమైక్యతకు ప్రతీకగా నిలిచింది. జాతీయ జెండాలను చేత పట్టుకుని స్థానిక బ్లాక్ చౌరస్తా నుంచి అంగడి బజార్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ మంగళవారం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని, జాతీయ సమైక్యతను చాటాలన్నారు. కథలాపూర్‌లో మేయిన్ రోడ్డు గుండా బీజేపీ నాయకులు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు మల్యాల మారుతి, నాయకులు కంటె సత్యనారాయణ, కథలాపూర్ మహేశ్, ఆరె శివ, తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి: ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని నక్కలపేట, మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం మండల శాఖ అధ్యక్షుడు కుమ్మరి తిరుపతి ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ పార్లమెంట్ కో–కన్వీనర్ సదాశివ్ మాట్లాడుతూ ఎస్సారెస్పీ ద్వారా బోలి చెరువును నింపి కమలాపూర్, నాగారం, తిమ్మాపూర్ గ్రామాల రైతులకు కావాల్సిన సాగు నీటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంతకముందు మండలంలోని నెలకొన్న సమస్యలపై ఇన్‌చార్జి తహసీల్దార్ సుమన్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు అంజన్న, ప్రభాకర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి



మాట్లాడుతున్న ఎంఈవో బండారి మధు

ఇబ్రహీంపట్నం: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈవో బండారి మధు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. హెచ్‌ఎంలు పాఠశాల స్థాయి ప్రణాళికను రచించుకుని వాటిని అమలు చేస్తు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ప్రభాత్ భేరి వాయిద్య బృందం పీడీ రాజు ఆధ్వర్యంలో బుధవారం రిహార్సల్ చేస్తున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండలంలోని డబ్బా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యులు నేమూరి శ్రీధర్ తన సొంత ఖర్చులతో విద్యార్థులకు ఐడెంటికార్డులను కార్డులను తయారు చేసి బుధవారం పాఠశాలలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం తనుగుల రమేశ్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే ఇళ్ల నిర్మాణం చేపట్టాలి



భూమిపూజ చేస్తున్న మేనేజర్ వెంకట్

రాయికల్: ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఇందిరమ్మ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టాలని మున్సిపల్ మేనేజర్ వెంకట్ అన్నారు. పట్టణంలోని 1వ వార్డులో ఇందిరమ్మ లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే నిర్మాణాలు చేపడితేనే బిల్లులు మంజూరవుతాయన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ తిరుమల, వార్డు ఇన్‌చార్జి షాకీర్, శివకుమార్, మున్సిపల్ సిబ్బంది రజాక్, గంగారెడ్డి, శేఖర్ తదితరుల పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

మల్లాపూర్: లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ నిరంజన్ అన్నారు. మంగళవారం మల్లాపూర్ మండలంలోని హుస్సేన్‌నగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించి రికార్డు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేస్తే బిల్లులు సకాలం చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సయ్యద్ హైదర్, పంచాయతీ కార్యదర్శి సదన్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇళ్ల పరిశీలన

మేడిపల్లి: భీమారం మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణలను పంచాయతీరాజ్ అధికారులు మంగళవారం పరిశీలించారు. త్వరగా నిర్మాణాలు పూర్తి చేయాలని లబ్ధిదారులను కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ ప్రసాద్, పీడీ భాస్కర్, ఎంపీడీవో నీరజ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.